# వశిష్ఠ గీత

జయం వెంకటాచలపతి: 81068 33554

మాయావిలాస విలసితమై, జనన మరణ చక్రబంధమైన ఈ సంసారమున మునిగి తేలుచున్న జీవుల నుద్ధరించుటకు ధర్మప్రబోధము చేయ సంకల్పించి మహాకవి వాల్మీకి ఆదికావ్యమైన రామాయణమును రచించెను. ధర్మము రెండు విధములు – ప్రవృత్తి ధర్మము, నివృత్తి ధర్మము. శ్రౌత స్మార్త రూపమగు కర్మకాండ యంతయు ప్రవృత్తి ధర్మము. సర్వ కర్మ సన్న్యాస పూర్వక జ్ఞానము నివృత్తి ధర్మము. ఈ రెండును వేదోద్భవములు. శ్రీ రాముని చరిత్ర పై రెండు ధర్మములకు నాదర్శము.కనుకనే వాల్మీకి మహర్షి పై రెండు ధర్మములను నిరూపించదలచి రామాయణమును ''పూర్వ, ఉత్తర రామాయణము'' లని రెండుగా విభజించెను. ఇందు పూర్వ రామాయణము రామచరితము కాగా, ఉత్తర రామాయణము ''యోగవాశిష్ఠ'' మను ఆధ్యాత్మిక గ్రంథము. పూర్వ రామాయణమందు బాల, అయోధ్య, అరణ్య, కిష్కింద, సుందర, యుద్ధకాండలు – ఆరు గలవు. ఉత్తర రామాయణము (యోగవాశిష్ఠము) నందు వైరాగ్య, ముముక్షు, ఉత్పత్తి, స్థితి, ఉపశమ, నిర్వాణము లను ఆరు ప్రకరణములు గలవు. ఇవిగాక పూర్వరామాయణమునకు ఉత్తరకాండ యను మరియొక కాండ గలదు. అట్లే, ఉత్తరరామాయణ (యోగవాశిష్ఠ) మునకు నిర్వాణోత్తర భాగమని మరొక ప్రకరణము గలదు. ఈ పూర్వోత్తర రామాయణ గ్రంథముల శ్లోక సంఖ్య 56 వేల శ్లోకములు. ఇందు పూర్వ రామాయణము 24 వేల శ్లోకములు, ఉత్తరరామాయణము 32 వేల శ్లోకములు గల్గి యున్నవి. ఉత్తర రామాయణ మంతయు శ్రీరామ వశిష్ఠుల సంవాదరూపమగుటవలన, అష్టాంగయోగ, జ్ఞానయోగములను బోధించుట వలన ''యోగవాశిష్ఠ'' మని పిలువ బడుచున్నది. ఈ రెండూ కలసిననే రామాయణము సంపూర్ణమగును.

శ్లో. వేదవేద్యే పరేపుంసి జాతే దశరథాత్మజే, వేదః ప్రాచేతసా దాసీత్సాక్షాద్రామాయణాత్మానా.

వేదవేద్యుడగు పరమాత్మ దశరథ పుత్రుడుగా జన్మింప, వేదము వాల్మీకి నుండి రామాయణ రూపముతో ఆవిర్భవించెను. దీనినిబట్టి శ్రీరాముడు పరమాత్మ రూపుడనియు, రామాయణము వేదరూపమనియు స్పష్టము. ఈ సందర్భములో ప్రవృత్తి నివృత్తి ధర్మములను రెంటినీ బోధించినపుడే రామాయణము వేదరూపమగును గాని కేవలము ప్రవృత్తి ధర్మమును

బోధించినంత మాత్రాన కానేరదు. కనుక యోగవాశిష్ఠముతో కలసిననే రామాయణము నివృత్తి ధర్మమును బోధించినదగును. అప్పడే "ఏష విగ్రహవాన్ ధర్మః" అను సూక్తి చరితార్థ మగును. సంపూర్ణమగును.

రణరంగమున ఇరువైపులగల సేనలనుజూచి శోకమోహములనుబొంది, యుద్ధ పరాఙ్ముఖుడైన అర్జునునకు తత్త్వోపదేశము చేసి స్వధర్మ మైన యుద్ధమందు ప్రవేశింప చేశాడు శ్రీకృష్ణుడు ద్వాపరయుగములో. యువరాజయి రాజ్యమునొల్లక విరాగుడై యున్న శ్రీరామునకు తత్త్వోపదేశ మొనర్చి వశిష్ఠుడు మరల రాజ్యవ్యవహారములందు ప్రవేశపెట్టాడు త్రేతాయుగములో. కనుక ఈ గ్రంథమునకు గీతా గ్రంథమునకు పోలిక యున్నది.

నారాయణునకు నరుడు బోధించినది 'వశిష్ఠ గీత' కాగా, నారాయణుడు నరునకు బోధించినది 'భగవద్గీత'. వశిష్ఠ గీత త్రేతాయుగములోని తత్త్వోపదేశము కాగా, భగవద్గీత ద్వాపరయుగములోని తత్త్వోపదేశము.

అవధూత దత్తపీఠ విద్యాధికారి శ్రీ కుప్పా వేంకట కృష్ణమూర్తి గారిచే జెమినీ T.V లో చేయబడిన ప్రవచనాలకు అక్షరరూపమై పాఠకుల కరకమలాలంకృతమైన "యోగవాశిష్ఠ హృదయము" అను వేదాంత గ్రంథము నందలి విషయములు పాఠకలోక సౌలభ్యము కొరకు వారికి కృతజ్ఞతా పూర్వక నమస్కారములతో ఇందుదహరించబడుచున్నది.

ఆధ్యాత్మిక గ్రంథములలో అత్యంత విశిష్ట మైనది వశిష్ఠ గీత. దీనిని యోగ వాశిష్ఠ మని, జ్ఞాన వాశిష్ఠ మని, వాశిష్ఠ రామాయణమని, మహారామాయణమని, ఉత్తర రామాయణమని వ్యవహరిస్తారు. ఇది 32,000 శ్లోకపరిమితిగలిగి ఆరు ప్రకరణములలో విస్తరించి అద్వైత సిద్ధాంత ప్రతిపాదితముగా వాల్మీకిమహర్షిచేత రచింపబడినది. ఈ గ్రంథావిర్భావమొక ప్రత్యేక పరిస్థితిలో జరిగినది.

రాముడు రాజ్యాధికారములో నున్న సమయములో నారదమహర్షి వాల్మీకిమహర్షికి బోధించాడు రామకథ సంగ్రహంగా. తరువాత బ్రహ్మదేవుడు రామాయణ రచన చేయమని ప్రోత్సహించి ఈ మహర్షికి భూతభవిష్యద్వర్తమానకాల జ్ఞానమును ప్రసాదించాడు. లవకుశులు జన్మించేనాటికి వాల్మీకి మహర్షి రామాయణ రచన చేస్తూనే యున్నాడు. బాలకాండ మొదలు యుద్ధకాండ వరకు ఆరు కాండలు వ్రాసి గ్రంథము పూర్తి చేయాలనుకొన్నారు మహర్షి. దానికితగ్గట్టే ఫలశ్రుతి కూడా రచించాడు. అయితే కుశలవులు

జన్మించిన తరువాత, ఉత్తరకాండ కూడా రచన చేశారు.రచనానంతరము ఈ కావ్యమును లవకుశులకు, తన ముఖ్య శిష్యుడైన భరద్వాజుడు, మొదలైనవారికి ఉపదేశించాడు.

ఈ రామాయణ రచనా సందర్భం లోనే బాలకాండలో మహర్షికి ఒక చిక్కు వచ్చిపడింది. విశ్వామిత్ర మహర్షి యాగరక్షణ నిమిత్తముగా రాముణ్ణి తనవెంట పంపమని అడగటం సువిదితమైన విషయమే. ఆ సమయంలో శ్రీరాముడు వైరాగ్యంలో మునిగిపోయి ఏమీ పట్టకుండా ఉంటున్నాడు. అప్పుడు వశిష్ఠ, విశ్వామిత్రు లిద్దరూ కలసి శ్రీరాముడి యొక్క తత్త్వ సందేహాలను తొలగించి ఆయనయొక్క ఆకర్మణ్యతను తొలగించారు.ఆ తరువాతనే శ్రీరాముడు తాటక సంహారము, సీతాకల్యాణము, మొదలైన విశిష్ట కార్యాలు నిర్వర్తించాడు. ఆ రామ వైరాగ్య ఘట్టాన్ని బాలకాండలోనే ప్రవేశపెట్టినట్లయితే - ఆ మహర్షులు చేసిన బోధ పూర్తిగా అక్కడ చెప్పకపోతే నిండుదనం రాదు. చెబితే, గ్రంథం మొదట్లోనే వేదాంత చర్చ పెరిగిపోయి, ముమ్ముందు తను చేయబోయే కావ్య వర్ణనలు, రస పోషణ మొదలైనవన్నీ పేలవమై కావ్యశరీరంలో సమతూకం దెబ్బతింటుంది. అందువల్ల వాల్మీకి మహర్షి ఆలోచనాపూర్వాకముగా పూర్వభాగమైన రామాయణ కావ్యములో ఈ వశిష్ఠ బోధ ప్రస్తావన లేకుండా ఆసన్నివేశమునే స్పృశించలేదు. కానీ మహర్షి హృదయములో తత్త్వవిద్యా రసమయమైన ఈ ఘట్టం మెదులుతూ ఉండడం వల్ల కొంతకాలము తర్వాత ఈ ఘట్టాన్నే వేరే గ్రంథంగా వ్రాయ సంకల్పించి నెమ్మదిగా వ్రాయ సాగాడు.

మహర్షి వద్ద తపో విధానాలలో శిక్షణ పొందుతున్న భరద్వాజుడనే శిష్యుడు తన గురువుగారివల్ల పూర్వ రామాయణ గ్రంథాన్ని ఉపదేశం పొంది అనేక ప్రదేశాలకు వెళ్లి ఆ గ్రంథాన్ని గానం చేస్తుండేవాడు.అప్పటికే అనేక యోగసిద్ధులు సాధించిన భరద్వాజుడు దేశ దేశాలకేగాక లోకలోకాలకూ వెళ్లి గానము చేసేవాడు. ఒకసారి మేరుశిఖరాగ్రాన దేవసభలో రామాయణం గానం చేశాడు. అతని అదృష్టవశాత్తు ఆ సభకు బ్రహ్మదేవుడు స్వయంగా విచ్చేశాడు. తన ప్రోత్సాహం వల్ల ఉద్భవించిన రామాయణ మహాకావ్య సౌందర్యాన్ని చవిచూసిన బ్రహ్మదేవుడు మహానందం పొందాడు. మునికుమారుడి గాన రీతి ఆయనకు బాగా నచ్చింది. దాంతో ఆయన ఆ కుర్రవాణ్ణి అభినందించి "ఏదన్నా వరం కోరుకో" మన్నారు. అందుకు భరద్వాజుడు "దేవా! సమస్త జీవులకూ దుఃఖము పోయే ఉపాయం చెప్పు. ఇదే నాకు కావలసిన వరం" అన్నారు. బ్రహ్మగారు నవ్వి ఇలా అన్నాడు. "దానికి నన్నడగడం దేనికయ్యా?

మీగురువుగారు క్రొత్తగా గ్రంథం మొదలు పెట్టారు గదా! ఆయన్నే ప్రార్థించు. ఆ గ్రంథాన్ని ఉపదేశం పొందితే, సముద్రాన్ని వంతెనతో దాటినట్లు సంసారాన్ని అవలీలగా దాటవచ్చు. (శ్లో. తస్మిన్ శ్రుతే నరో మోహాత్ సమగ్రాత్ సంతరిష్యతి, సేతునేవాంబుదేః పారం అపారగుణ శాలినా.) అని బ్రహ్మదేవుడు గ్రంథ రచన పూర్తికాకముందే గ్రంథ వైశిష్ట్యాన్ని శ్లాఘించాడు. కానీ ఆరోజుల్లో శిష్యులకు గురువుగారి దగ్గర ఎంత చనువున్నా నాకు ఫలానా ఉపదేశముచెయ్యండి అని అడిగే పద్ధతి ఉండేది కాదు. భరద్వాజుడి లాంటి మహా సిద్ధపురుషులు కూడా బ్రహ్మదేవుడితో నైనా నిర్భయంగా మాట్లాడగలరు గానీ గురువుగారిదగ్గర అలా మాట్లాడేవారు కాదు. అది భయముతో కూడిన భక్తి. ఆదర్శప్రాయమైన గురుభక్తి. భరద్వాజుని మానసిక స్థితిని గ్రహించిన బ్రహ్మ సంతోషించి, సరే నేనే మీ గురువు గారితో చెబుతాను అని భరద్వాజుడిని వెంటనిడుకొని వాల్మీకి ఆశ్రమానికి వచ్చాడు.బ్రహ్మగారిని చూచిన వాల్మీకి మహర్షి భక్త్యావేశము పెల్లుబకగా బ్రహ్మను అనేకవిధాల పూజించాడు. బ్రహ్మ మహర్షి తో ఇలా చెప్పాడు: "ఓ మునివర్యా! ఇప్పుడు నీవు రచిస్తున్నది గొప్ప వేదాంత గ్రంథము. శ్రీరాముని యొక్క అసలైన స్వరూపాన్ని నీవు అందులో వర్ణిస్తున్నావు. కనుక దానిని మధ్యలో ఆపరాదు. దీనివల్ల సమస్తలోకాలకూ ఉపకారము జరుగుతుంది. సంసార సాగరానికి ఇది పడవ వంటిది. లోకులు ఈ పడవతో ఆ సాగరాన్ని అవలీలగా దాటెదరు.ఇది చెప్పటానికే నేను ఇప్పుడు వచ్చాను." అని పలికి అంతర్ధానమైనాడు బ్రహ్మ దేవుడు.

మహర్షికి ఏమి జరిగిందో సరిగ్గా అర్థం కావడం లేదు. గాలికి సముద్రములో ఒక కెరటం లేచి దానిని చూసే లోపే అణిగి పోయి సముద్రములోనే కలసిపోయినట్లుంది అప్పటి పరిస్థితి. కొంతసేపటికి తేరుకున్న మహర్షి శిష్యుణ్ణి పిలిచి "నాయనా! బ్రహ్మగారు ఏమి చెప్పారు? నాకు సరిగా చెప్పు" అన్నాడు. భరద్వాజుడు బ్రహ్మగారి మాటలను యథాతథంగా చెప్పాడు గురువు గారికి. బ్రహ్మగారి భావం అర్థమైన గురువుగారు ఆ గ్రంథం గురించి ఆ కుర్రవాడితో చర్చించాడు. అప్పుడు భరద్వాజుడు మెల్లిగా "గురుదేవా! పూర్వ రామాయణం పరిశీలిస్తే ఒక్కోసారి రాముడు సాంసారిక సుఖ దుఃఖాలలో కొట్టుకుపోయాడేమో అనిపిస్తుంది. కొన్ని చోట్ల చూస్తే ఆయన మహాజ్ఞానేమో, తత్త్వజ్ఞుడేమో అనిపిస్తుంది. ఆ మహాతల్లి సీతాదేవి ప్రవర్తనా అంతే. గురుదేవా! శ్రీరాముడు, సీతాదేవి, లక్ష్మణాది సోదరవర్గమూ, వీరంతా ఈ సంసారయాత్రలో జ్ఞానులుగా ప్రవర్తించారా? అజ్ఞానులుగా ప్రవర్తించారా? ఆ వివరాలు నాకుపదేశించండి" అని అడిగాడు.

వాల్మీకి మహర్షి బ్రహ్మ ఆజ్ఞ మేరకు గ్రంథాన్ని ప్రథమంగా తన శిష్యుడైన భరద్వాజుడికే ఉపదేశించాలని నిశ్చయించుకొని, అప్పటివరకు రచించిన గ్రంథమంతా శిష్యుడికి వినిపించి , తరువాత భాగము ఏరోజు వ్రాసింది ఆరోజు తాను శిష్యుడికి ఉపదేశిస్తూ ఉండేవాడు. ఆవిధంగా బ్రహ్మదేవుడి ఆజ్ఞ, వాల్మీకి మహర్షి యొక్క తత్త్వ తపన, భరద్వాజ మునికుమారుని యొక్క జిజ్ఞాస — మూడూ ఒకటికాగా ఉద్భవించిన మహాగ్రంథమే ఈ యోగవాశిష్ఠము.

సుతీక్ష్ణుడనే బ్రాహ్మణుడు ఒకసారి ఆగస్తి మహాముని ఆశ్రమానికి వెళ్లి మోక్షానికి కారణం కర్మా ? జ్ఞానమా ? లేక రెండూనా ? అని వినమ్రంగా అడిగాడు. ముని ఇలా చెప్పాడు. బ్రాహ్మణోత్తమా పక్షి రెండు రెక్కలూ ఉంటేనే ఆకాశానికి ఎగురుతుంది. ఒంటి రెక్కతో ఎగరలేదు. అలాగే మానవుడు జ్ఞాన కర్మలు రెండూ ఉంటేనే మోక్షం పొందుతాడు. ఒక్కదానితో మోక్షం పొందలేడు. కాబట్టి జ్ఞాన కర్మలు రెండూ మోక్షానికి సాధనాలు. ఈ విషయంలో నీకొక కథ చెపుతాను విను అన్నాడు ముని.

పూర్వకాలంలో అగ్నివేశ్యుడనే బ్రాహ్మణుడికి కారుణ్యుడనే కుమారుడుండేవాడు. ఇతడు వేదవేదాంగాలు బాగా చదివి గురుకులంనుంచి ఇంటికి వచ్చి కర్మానుష్ఠాన మేమీ లేకుండా ఉండేవాడు. తండ్రి కొడుకును చూచి "నీవు కర్మ మానుటకు కారణమేమి ?" అని అడిగాడు. తండ్రీ! శ్రుతులు కొన్ని జీవితాంతమూ కర్మలు చేయమన్నాయి. ఇది ప్రవృత్తి ధర్మమట. మరికొన్ని శ్రుతులు "ధనము, కర్మ, సంతానము" ఇవేమీ మోక్షానికి కారణాలు కావంటున్నాయి. కర్మ సన్యాసము ఒక్కటే మోక్షానికి కారణమని చెప్పచున్నాయి. ఇది నివృత్తి ధర్మమట. ఈ రెండింటిలో ఏది చెయ్యాలో నాకు తోచడం లేదు. అందువల్ల ఊరుకున్నాను అన్నాడు కొడుకు. అప్పుడు కుమారా! నీకొక కథ చెపుతాను దాన్ని విన్న తరువాత నీకు తోచినట్లు చెయ్యి. అని కథ చెప్పడం ప్రారంభించాడు తండ్రి.

పూర్వం సురుచి అనే అప్సరస స్త్రీ హిమాలయ శిఖరం మీద కూర్చొని ఉండగా పై నుంచి ఆకాశ మార్గాన దేవదూత వెళ్ళు చుండగా చూచింది. "ఎక్కడికి వెళ్ళుచున్నావు ? ఎక్కడినుండి వస్తున్నావు ?" అని అడిగింది. ఆమెకు దేవదూత ఇలా చెప్ప సాగాడు. అరిష్టనేమి అనే రాజు రాజ్యభారము కొడుకునకప్పగించి గంధమాదన పర్వతం మీద తపస్సు చేస్తున్నాడు. అతని వద్దకు దేవేంద్రుడు ఒక వర్తమానము పంపాడు. నేను ఆవిషయము అతనికి చెప్పి తిరిగి దేవలోకానికి వెళుతున్నాను అన్నాడు దేవదూత.

అయితే ఆ అరిష్టనేమి మహారాజుగారి కథ ఏమిటి ? నాకు వినాలని ఉంది. కోపగించుకోకుండా చెప్పమని అడిగింది సురిచి. దేవదూత అరిష్టనేమి వృత్తాంతము సురిచికి చెప్పసాగాడు. గంధమాదనం మీద అరిష్టనేమి తపస్సు చేస్తూ ఉండగా మాప్రభువు విమానము తీసుకొని వెళ్లి ఆయన్ను స్వర్గానికి తీసుకురమ్మన్నాడు. నేను విమానం తీసుకొని గంధమాదనానికి వెళ్లాను. ఆ రాజపుంగవునితో మా శచీపతి చెప్పినమాట చెప్పాను. అతడు అంతా సావధానంగా విని, దేవలోకంలోని విశేషాలు చెప్పమన్నాడు. అక్కడ పరిస్థితి తెలుసుకొంటే గాని కర్తవ్యం నిర్ణయించుకోలేనన్నాడు. నేను వున్న వాస్తవం చెప్పాను. స్వర్గంలో పుణ్యం కొద్దీ సుఖం అనుభవిస్తారన్నాను. పరుల గొప్పతనాన్ని సహించలేరన్నాను. ఒకరి నొకరు కలహిస్తారన్నాను. అసూయ కూడా మెండు అన్నాను.తక్కువ వాళ్ళను చూస్తే ఎక్కువ వాళ్లకు మహాసంతోషం అన్నాను. పుణ్యం అంతా ఖర్చుపెట్టుకొని తుదకు స్వర్గాన్ని విడిచి భూలోకానికి వెళ్ళలేక ఏడుస్తారు అన్నాను. అంతా విన్న అరిష్టనేమి ఇలాంటి స్వర్గం నాకు అక్కరలేదన్నాడు. ఇంకా ఘోర తపస్సు చేస్తాడట. శరీర త్యాగం చేస్తానన్నాడు. నీకు, నీస్వర్గానికి దండం అని నన్ను పొమ్మన్నాడు. నేను విమానం త్రిప్పి తీసుకొని వచ్చినాను. విషయమంతా ఇంద్రుడికి చెప్పాను. ఇంద్రుడాశ్చర్యపోయి వెంటనే ఆరాజును వాల్మీకి ఆశ్రమానికి చేర్చమన్నాడు. ఇతనికి తత్త్వోపదేశం చేయమని వాల్మీకి తో చెప్పమన్నాడు.నేను మళ్ళీ గంధమాదనం చేరాను. అరిష్టనేమి వద్దకువెళ్ళి అతన్ని వాల్మీకి ఆశ్రమానికి తీసుకు వచ్చాను. దేవేంద్రుడు చెప్పినమాట వాల్మీకితో చెప్పాను. ఆ రాజుకూడా ఆధ్యాత్మిక తత్త్వోపదేశం చేయమని వాల్మీకి మహర్షిని కోరాడు. సంసార దుఃఖం పోయేది ఎలాగో చెప్పమన్నాడు. వాల్మీకి అరిష్టనేమిని కుశలం అడిగి వాసిష్ఠ రామాయణ కథ చెపుతా వినమన్నాడు.

మహర్షీ! రాముడెవరు? ముక్తుడా? బద్ధుడా? నీవు తత్త్వవేత్తవు గదా! ముందు తేల్చి చెప్పమన్నాడు అరిష్టనేమి.

రాముడు విష్ణువు. శాపవశాన రాజుగా భూలోకాన అవతరించాడన్నాడు మహర్షి.

అయితే చిదానంద రూపుడయిన విష్ణువుకు శాపమెందుకు వచ్చింది? ఎవరు శపించారు? అని అడిగిన రాజుకు వాల్మీకి ఇట్లు చెప్పచున్నాడు.

1) బ్రహ్మలోకంలో సనత్కుమారుడనే నిష్కాముడుండేవాడు. ఒకసారి విష్ణువు బ్రహ్మలోకానికి రాగా బ్రహ్మాదులందరూ విష్ణువును పూజించారు సనత్కుమారుడు తప్ప.

ఇందుకు ఆగ్రహించిన విష్ణువు ''కామార్తుడవై శరజన్మ అనే పేరుతో భూలోకములో పుట్ట''మని శపించాడు సనత్కుమారుణ్ణి . సనత్కుమారుడు కూడా సామాన్యుడు కాడు. ''నీ సర్వజ్ఞత్వం కోల్పోయి అజ్ఞానివై కొంతకాలం ఉండగలవ'' ని విష్ణువును శపించాడు సనత్కుమారుడు.

2) పూర్వం దేవదానవులకు జరిగిన యుద్ధంలో దానవులకు సహాయం చేసిన భృగుపత్నిని చంపిన విష్ణువును, నీకు కూడా భార్య వియోగం కలుగుతుందని భృగువు శపించాడు.

3) జలంధరుడి భార్య బృంద, పతి వేషముతో మోసగించిన విష్ణువును ''భార్యావియోగము'' కలుగునని శపించింది.

4) పయోష్ణీ నదీ తీరాన దేవశర్మ భార్య నృసింహ వేషంతో ఉన్న విష్ణుమూర్తిని చూచి భయపడి చనిపోయింది. అంతట నావలె నీవు కూడా భార్యావియోగాన్ని పొందుతావని దేవశర్మ శపించాడు.

ఇలా ఇంతమంది శాపాలతో భూలోకంలో మనుష్యుడగా రాముడై అవతరించాడు విష్ణువు. ఇతనికి సనత్కుమారుని శాపమువలన సర్వజ్ఞత్వం పోయి అజ్ఞానం సంభవించింది. మిగతా ముగ్గురి శాపాల వలన మూడుమార్లు సీతా వియోగము తటస్థించింది. రావణుడు అపహరించినపుడొకమారు. మిథ్యాపవాదం తో రెండవమారు, భూప్రవేశంతో మూడవమారు రామునకు సీతావియోగమేర్పడింది.

ఇక నీవడిగిన మోక్షసాధన చెపుతానన్నాడు వాల్మీకి అరిష్టనేమితో. ఇంతవరకు నాకు తెలిసినంత అరిష్టనేమికథ నీకు తెలిపినానన్నాడు సురుచితో దేవదూత. ఇక వశిష్ఠ గీత చదవాలి వాల్మీకి అరిష్టనేమికి చెప్పిన తత్త్వసారము తెలుసుకోవడానికి.

ఆధ్యాత్మిక తత్త్వచింతనచేయు జిజ్ఞాసులకు ఇది చాలా చక్కని అద్వైత గ్రంథ రాజము. చదివి తరిద్దాం. _ _ _ _ _ _ .సర్వేజనాః సుఖినోభవంతు.